


కడియపులంక సర్పంచ్‌గా పద్మావతి ఏకగ్రీవం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపు లంక సర్పంచ్ ఉప ఎన్నికల్లో మారిశెట్టి పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి మణికుమార్ తెలిపారు. గత సర్పంచ్ మార్గాని అమ్మాణి ఆకస్మిక మరణం నేపథ్యంలో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు. ఆమె కుమార్తె పద్మావతి పోటీలో ఉండడంతో పార్టీలకతీతంగా, గ్రామ పెద్దలు అందరూ సహకరించడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారులు ఈ మేరకు ఆమెకు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.



స్మార్ట్‌పై వెల్లువెత్తిన ఆగ్రహం

- సబ్ స్టేషన్ల వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలు చోట్ల ధర్నాలు
- స్మార్ట్ మీటర్లతో ప్రజలపై పెనుభారం : సిపిఎం
- ప్రజా వ్యతిరేక విధానాలు ఆపాలి : సిపిఐ



రాజమహేంద్రవరంలోని జాంపేట సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం ప్రతినిధి

స్మార్ట్ మీటర్ల బిగింపుపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలో పలుచోట్ల ధర్నాలు జరిగాయి. పలుచోట్ల ప్రజలు స్వచ్ఛందంగా ఈ ధర్నాల్లో పాల్గొన్నారు. ఈ నిరసనలకు సిపిఎం, సిపిఐలు సంపూర్ణ మద్దతు తెలిపాయి.

స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరంలోని జాంపేట సబ్ స్టేషన్ వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల పేరుతో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలపై భారం మోపిందన్నారు. అదానీ కంపెనీకి రాష్ట్ర ప్రజలను తాకట్టు పెట్టేందుకు పూనుకుందని విమర్శించారు. అదానీ కంపెనీ మనుషులు ప్రతి ఇంటికి వెళ్లి స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని తెలిపారు. దీనిపై విద్యుత్ అధికారులను అడిగితే తమకేమీ సంబంధం లేదని అంటున్నారన్నారు. ప్రజలు స్మార్ట్ మీటర్లు బిగించాలని వస్తే ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కొత్త కంపెనీకి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీలు వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. ఫోన్లు రీఛార్జి చేసుకునే విధంగా కరెంటు యూనిట్లను కూడా రీఛార్జి చేసుకునేందుకు, ముందుగానే ప్రజల నుంచి వేలకోట్ల రూపాయలను డబ్బులు వసూలు చేసుకునేందుకు అదానీ కంపెనీకి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. విద్యుత్ ఛార్జీలను అదానీ కార్యాలయం నుంచి నియంత్రించే విధంగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారని చెప్పారు. డిమాండ్‌ను బట్టి విద్యుత్ ఛార్జీల పెంపుదలను అప్పటికప్పుడు చేపట్టి ప్రజల నెత్తిన భారాలు వేయడానికి కుట్రలు పన్నారన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శి టి మధు మాట్లాడుతూ విద్యుత్ బకాయిల సర్దుబాటు పేరుతో ఇప్పుడు వేల కోట్ల రూపాయల అదనపు భారాలను ప్రజలపై మోపడం సరికాదన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. లేకుంటే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, నాయకులు బి.పూర్ణిమారాజు, ఎస్ఎస్.మూర్తి, పడాల రామకృష్ణ, ఎ.సుబ్రహ్మణ్యం, జువ్వల రాంబాబు, ఎఐటియుసి నాయకులు కె.రాంబాబు, కొండలరావు, నల్లా రామారావు, అనిల్, ఎస్‌యుసిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాజమండ్రినగర కార్యదర్శి కిరణ్ కుమార్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరావు, కె.సూరిబాబు, కె.భానుప్రసాద్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు, దినేష్, డివైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.భగత్ మద్దతు తెలిపి మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలన్నారు. సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై మరింత భారం పడుతుందన్నారు. అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రయత్నం చేస్తే ప్రజలతో కలిసి తిప్పికొడతామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.రత్నాజీ, అయినపర్తి శ్రీనివాసరావు, ఎఐఎస్‌టియు నాయకులు పి.పెంటయ్య, అడపా సూర్యారావు, టి.పుల్లయ్య, కె.చిరంజీవి, కె.శ్రీను, టి.రాజు, సిహెచ్.వెంకయ్య, కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో స్మార్ట్ మీటర్ల తొలగించాలంటూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు జె.సత్తిబాబు మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మురుకుర్తి వీరలక్ష్మి, తుమ్మల కోశావతి, బొలిశెట్టి సత్యవతి, తమ్మర గౌరి, ఎస్.లక్ష్మి, బి.సీత, జి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిడదవోలు ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రజా వేదిక రాష్ట్ర పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఐఎఫ్‌టియు జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ తెలిపారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజల జేబులు గుల్ల చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో అధిక కరెంటు బిల్లులు చెల్లించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లిడి రామిరెడ్డి, మోర్త పోసియ్య, పి.మోహన్ సారథి, గాలి గనిరాజు పాల్గొన్నారు.


దేవరపల్లిలో విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

15లోగా బంగారు కుటుంబాల మ్యాపింగ్

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

ఈ నెల 15లోగా బంగారు కుటుంబాల మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అమరావతి నుంచి కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పి4 సర్వే పురోగతిపై దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. 2029 నాటికి పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పి4 కార్యక్రమం ద్వారా సమాజంలోని ఆర్థిక అసమానతలను తగ్గించి, పేదలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 66 వేల బంగారు కుటుంబాలను గుర్తించాలని లక్ష్యం పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు 60 వేల కుటుంబాలను గుర్తించామన్నారు. ఐదు వేల కుటుంబాలకు మార్గదర్శకులను మ్యాపింగ్ చేశామని తెలిపారు. మిగిలిన బంగారు కుటుంబాలను కూడా ఆగస్టు 15 లోపు గుర్తించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు బిఫోర్ 'నీడ్ బేస్డ్' సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శకులు సమన్వయంతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి 25 కుటుంబాలకు ఒక గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని నియమించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని, నెలలో మూడుసార్లు ముఖ్యమంత్రి స్వయంగా సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో మ్యాపింగ్ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బందికి తగిన మార్గదర్శకం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ టి.సీతా రామ మూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్ భాస్కర్‌రెడ్డి, సిపిఒ ఎల్.అప్పలకొండ, బిసి సంక్షేమ అధికారి బి.శశాంక, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, ఎ.స్లీవా రెడ్డి, డిఐ పిఆర్ఒ కె.లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

డిఎస్‌సి ఫైనల్ కీలో తప్పులను సరిచేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సి ఫైనల్ కీలో అనేక తప్పులున్నాయని, వాటిని సరిచేసి డిఎస్‌సి ఫలితాలు ప్రకటించాలని డివైఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వి.రాంబాబు, ఎన్.సాయిప్రసాద్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పుడు మెగా డిఎస్‌సిపై ముఖ్యమంత్రి మొదటి సంతకం పెట్టారన్నారు. సంతకం పెట్టిన 8 నెలలు తర్వాత నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. 45 రోజుల్లో పరీక్ష నిర్వహించారని తెలిపారు. కీ విడుదల చేయడానికి 20 రోజుల సమయం తీసుకున్నారన్నారు. అయినప్పటికీ అందులో అనేక తప్పులు ఉన్నాయని అభ్యర్థులు ప్రభుత్వానికి తెలియజేశారన్నారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఈ సమస్య వల్ల సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న డిఎస్‌సి అభ్యర్థులకు తగిన న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ కమిషనర్, విద్యాశాఖ మంత్రి స్పందించి ఫైనల్ కీలో తప్పులను సరిచేసి, డిఎస్‌సి ఫలితాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్, జి.కృష్ణ పాల్గొన్నారు.

దారి ఏర్పాటుకు ఆదేశం

ప్రజాశక్తి – రాజానగరం

ఈజ్‌మెంట్ హక్కు ప్రకారం యడ్ల ఏసయ్యకు మూడు అడుగుల వెడల్పుతో నడక దారి మార్గం ఏర్పాటు చేయాలని రాజానగరం తహశీల్దార్‌ను ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్ ఆదేశించారు. మండలంలో పాతతుంగపాడు చెందిన యడ్ల ఏసయ్యకు ప్రభుత్వం సర్వే నెంబరు 286/1లో విస్తీర్ణం 2.44 ఎకరాల ప్రభుత్వ భూమిని డి-ఫారం పట్టా మంజూరు చేశారు. ఈ భూమికి దారి మార్గంగా పక్కనే ఉన్న సర్వే నెంబరు 285/5లో గంగుమళ్ళ వీరబాబు, గంగుమళ్ళ వెంకన్నబాబు అనే జిరాయితీ భూమి ఉంది. దీనికి వారు కంచె వేసి దారిని మూసేశారు. ఏసయ్యను తన భూమికి వెళ కుండా అడ్డుకుని ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో ఏసయ్య ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన తహశీల్దార్ జివిఎస్ దేవితో కలిసి మంగళవారం పరిశీలించారు.

మొక్కల పెంపకం పరిశీలన

ప్రజాశక్తి – సీతానగరం

సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకిరా మియావాకి పద్ధతిలోని చేపట్టిన మొక్కల పెంపకం పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఎం.నాగఉమా మహేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. జపాన్ పర్యావరణవేత్త అకిరా మియావాకి అభివృద్ధి చేసిన ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, తక్కువ సమయంలోనే దట్టమైన అడవిని పెంచొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులందరూ మొక్కల పెంపకం పనుల పురోగతిని, వాటి నాణ్యతను దగ్గరుండి పరిశీలించారు. ఆయనతో ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, ఎంపిడిఒ ఎం.భారతి, ఎపిఒ సత్యవతి, టిఎ వీరబాబు తదితరులున్నారు.

కార్టూ'నిజం'



ఉపాధ్యాయులను చదువు చెప్పనివ్వండి

పిడిఎఫ్ ఎంఎల్‌ఎ బొర్రా గోపి మూర్తి

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆన్‌లైన్ యాప్‌లతో, వివిధ బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయుల బోధన సమయాన్ని హరించడం సమంజసం కాదని, వారిని చదువు చెప్పనివ్వాలని పిడిఎఫ్ ఎంఎల్‌ఎ బొర్రా గోపిమూర్తి అన్నారు. మంగళవారం ఆయన కృతజ్ఞతా పర్యటనలో భాగంగా రాజమండ్రి రూరల్ మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాల, బొమ్మూరు ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం తదితర విద్యా సంస్థలను సందర్శించారు. తనను గెలిపించినందుకు కృతజ్ఞతల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వారి పోరాటాలకు ఎప్పుడూ తన మద్దతు ఉంటుందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాన్నారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛగా బోధించే అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వాల విధానాలతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల వెంటనే చెల్లించాలన్నారు. 12వ పిఆర్‌సి అమలు చేయాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయ సంఘం నేతలు ఇవిఎస్‌ఆర్.ప్రసాద్, అనిల్, టాల్ స్టాయ్,నూకరాజు తదితరులు ఉన్నారు.


అధ్యాపకులతో పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపిమూర్తి

కొవ్వూరులో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి– కొవ్వూరు

పట్టణంలో ఇందిరమ్మ కాలనీలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిఎస్‌పి జి.దేవకుమార్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్‌ను మంగళవారం నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీలోని ప్రతి ఇంటినీ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డు లేని వాహనాలను సీజ్ చేశారు. అనుమానం కలిగిన వ్యక్తుల వివరాలను సేకరించారు. గంజాయి,, గుడుంబా వంటి అమ్మకాలపనై ఆరా తీశారు. కొవ్వూరు డిఎస్‌పి దేవకుమార్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని స్టేషన్ల పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. అనుమానితులు ఎవర్నీ గుర్తించలేదన్నారు. రికార్డులు లేని 29 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లాలని వివరించారు. కొవ్వూరు పట్టణ, రూరల్ సిఐలు పి.విశ్వం, కె.విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు, కానిస్టేళ్లు

ఇంటింటా ఫీవర్ సర్వే

ప్రజాశక్తి – చాగల్లు

ఇంటింగా ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆశావర్కర్లకు వైద్యాధికారులు సూచించారు. ప్రతి నెల నిర్వహించే ఆశ డే సమావేశం చాగల్లు మండలంలోని చాగల్లు, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి, మార్కొండపాడు పిహెచ్‌సిల్లో ఆయా వైద్యాధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలకుండా వెంటనే సర్వే చేయాలన్నారు. వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణుల నమోదు త్వరగా పూర్తి చేయాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. ఈ సమావేశానికి చాగల్లు బ్రాహ్మణగూడెం కరవలపల్లి మార్కొండపాడు పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఆశాలు హాజరయ్యారు.

'టీ తాగుతూ మాట్లాడుకుందాం రండి'

ప్రజాశక్తి–కడియం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల సాధన కోసం ఉద్యోగుల సంఘం 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘ జిల్లా కార్యదర్శి సిహెచ్.ఎస్.విల్సన్ పాల్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆగష్టు 5న ప్రారంభమై ప్రతి వారం ఒక కాన్సెప్ట్‌తో మూడు నెలల పాటు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం ఉద్యోగులకు రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిల చెల్లింపు, డిఎ, ఐఆర్, పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు వంటి ఉమ్మడి సమస్యలతో పాటుగా అన్ని శాఖల ఉద్యోగులకు పలు రకాల సమస్యలున్నాయన్నారు. వాటి పరిష్కారం కోరుతూ వారి, వారి కార్యాలయంలోనే ఉద్యోగులతో సమావేశమై టీ తాగుతూ సమస్యలను చర్చించి, పరిష్కార మార్గాలను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని శాఖల ఉద్యోగులతో ఈ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ ఎఒ సుబ్బారావు, జిల్లా నాయకులు జె.రాజారావు, కె.శ్రీనివాసరెడ్డి, టి.మణిశ్రీ, రూరల్ తాలూకా నాయకులు ఎన్‌విఎస్.రాజు, పి.మురళీకృష్ణ, డాక్టర్ టివి.శ్రీధర్, డాక్టర్ ఎన్.మౌర్య, కెఎన్.మూర్తి, ఐవిఎస్.వశిష్ఠ, వి.ఉమామహేశ్వరి, ఎ.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది

పిహెచ్‌సిలో ఎంఎల్‌ఎ ముప్పిడి తనిఖీలు

ప్రజాశక్తి – చాగల్లు

చాగల్లు పిహెచ్‌సిలో ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో ఉన్న కొన్ని వస్తువులను వెంటనే మార్చాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆవరణలో మొక్కలు, చెత్తను వెంటనే తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడారు. మరుగుదొడ్లు సవ్యంగా లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే వాటిని కూడా బాగు చేయించాలన్నారు. వర్షం సమయంలో స్లాబ్ నుంచి నీరు కారుతుందని ఎంఎల్‌ఎ దృష్టికి వైద్యులు తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందించారు. వాటర్ లీకుల నివారణకు మరమ్మతు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిఎంహెచ్‌ఒతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వెంట ఎఎంసి మాజీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, నాయకులు తాళ్లూరి శ్రీనివాస్, వైద్యులు తనూజ, టి.మనోజ్, సీనియర్ అసిస్టెంట్ జయంత్, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, పంచాయతీ కార్యదర్శి మహ్మద్ అలీ తదితరులున్నారు.

సకాలంలో సరుకులను చేర్చాలి

ప్రజాశక్తి–గోపాలపురం

రేషన్ సరుకుల సరఫరాలో అలసత్వం లేకుండా డీలర్ల పాయింట్లకు సమయానికి చేర్చాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గణేష్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పౌర సరపరాల శాఖ మండల స్థాయి స్టాక్ పాయింట్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్టేజ్ వన్ నుంచి వచ్చే సరుకుల్లో నాణ్యత లోపిస్తే తక్షణమే ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చి, ఆ స్టాక్‌ను వెనక్కి పంపించేయాలని మండల స్థాయి ఇన్‌ఛార్జికి తెలిపారు. గుత్తేదారుల నుంచి వస్తున్న కందిపప్పు, పంచదార నాణ్యతలను ఆయన పరిశీలించారు. ప్రతినెల స్టేజ్-2 నుంచి సరకులను 15వ తారీకు నుంచి 25వ తేదీలోగా డీలర్ల పాయింట్లకు చేర్చాలని సూచించారు. గోడౌన్‌లోని నాణ్యత లోపించిన కొద్దిపాటి కందిపప్పును, పంచదార పగిలిన ప్యాకెట్లను పరిశీలించారు. ం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట మండల స్థాయి స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జి సరీనా సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి – రాజానగరం

ంవెన్యూ శాఖ పరిధిలో ఉన్న అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆర్‌డిఒ ఆర్.కృష్ణనాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డులు, రేషన్ కార్డుల పంపిణీ, వాటర్ ట్యాక్స్, జిఒ 23 అమలు, అన్నదాత సుఖీభవ, ఆధార్ సీడింగ్ వంటి వాటిలో వస్తున్న లోపాలను గుర్తించి పరిష్కరించాలన్నారు. భూమిలేని నిరుపేదలు నివాస స్థలాల కోసం వచ్చిన అర్జీలను పరిశీలించాలన్నారు. దీనికి అవసరమైన భూములను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. స్వామిత్వ పథకం, రీ-సర్వే ప్రక్రియలపై సమాంతరంగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జివిఎస్.దేవి, డిప్యూటీ తహశీల్దార్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

సత్తిరాజుకు సేవారత్న అవార్డు

ప్రజాశక్తి –దేవరపల్లి

సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్ సుంకవల్లి సత్తిరాజుకు విశ్వజనని ఫౌండేషన్ "విశ్వజనని సేవారత్న, స్పెషల్ జ్యూరీ అవార్డు"ను ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకట్రాజు, కొవ్వూరు ముప్పిడి వెంకటేశ్వరరావు సుంకవల్లి సత్తిరాజుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సత్తిరాజు ఈ నెల 20న హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో జరిగే ఓ కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకుంటారని విశ్వజనని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. సత్తిరాజు పలు విద్యాసంస్థల్లో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తునానరు. అంతేకాకుండా విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలను, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నారు. పర్యావరణ సంరక్షణకు కృషి చేయడం అసహాయులకు, అనాథలకు, వృద్ధాశ్రమాలకు పలు సేవలను చేస్తున్నారు. ఈ సేవలకు గాను ఆయనకు అవార్డు దక్కింది.

సమగ్ర ఎరువుల వాడకంపై అవగాహన

ప్రజాశక్తి – సీతానగరం

సమగ్ర ఎరువుల వాడకంపై రాజమహేంద్రవరం ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహరావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం వంగలపూడిలో జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఎడిఎ ఎస్.జయరామలక్ష్మి అధ్యక్షత ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాండం తొలుచు పురుగు నివారణా చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒలు గౌరీదేవి, రామతులసి, సూర్యరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను పూర్తిగా అరికట్టాలి : వేణు

ప్రజాశక్తి – గోపాలపురం

నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను అరికట్టాలని వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు సాలి వేణు డిమాండ్ చేశారు. బెల్లు షాపుల ద్వారా నిబంధనలకు విరుద్దంగా అధిక రేట్లకు మద్యం విక్రయాలు చేయడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో యువత మద్యానికి బానిసవతుందన్నారు. మద్యం మత్తులో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. మద్యం సేవించిన యువత ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. పేద కుటుంబాలు చితికిపోతున్నాయన్నారు. బెల్ట్ షాపులను పూర్తి స్థాయిలో అరికట్టాలని లేనిపక్షంలో నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

ఆర్ అండ్ బి మంత్రిని కలిసిన ఎంఎల్‌ఎ బత్తుల

ప్రజాశక్తి – సీతానగరం

రాజానగరం నియోజకవర్గంలో రోడ్డు పనుల జాప్యంపై చర్యలు తీసుకోవాలని, కొత్త రోడ్డు పనులను మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ రహదారులు మరియు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు బత్తుల తెలిపారు. కాంట్రాక్టర్లు కావాలనే పనులను ఆలస్యంగా చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించినప్పటికీ పనులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇది కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నమని, దీనివల్ల ప్రజల్లో అసంతృప్తి పెరిగి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని వివరించారు. జాప్యం జరుగుతున్న రోడ్డు పనుల వివరాలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కాంట్రాక్టర్‌పై విచారణ జరిపించి త్వరలో పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజానగరం–పెద్దపర్తిరేవు రహదారి, రాజమహేంద్రవరం– కేసవరం రహదారి ప్రాముఖ్యతను వివరించారు. ఈ ప్రతిపాదనలపై మంత్రి స్పందిస్తూ, రోడ్డు పనులకు త్వరలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని బత్తుల బలరామకృష్ణ తెలిపారు.

తంటికొండలో తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి–గోకవరం

మండలంలోని తంటికొండలో ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రంజిని ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు వారోత్సవాల 7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. తల్లిపాల వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


పట్టుకున్న పిడిఎస్ బియ్యం, నిందితులతో అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

వ్యాన్‌లో తరలిస్తున్న 3,631 కేజీల పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా సివిల్ సప్లయి అధికారి సత్యనారాయణరాజు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో డిఎస్ఒ సత్యనారాయణ రాజుతోపాటు, ప్రత్తిపాడు సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ నాగబాబు, సిబ్బంది జగ్గంపేట రోడ్డులో మాటు వేశారు. ఆ సమయంలో ఒక వ్యాన్‌లో జగ్గంపేట నుంచి గోకవరం వైపు వెళ్తున్న వ్యాన్‌ను నిలుపుదల చేసి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 3,631 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రామవరం వద్ద గల గొడౌన్‌కు తరలించారు. అనధికారికంగా పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తులపై 6ఎ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు.

సారా విక్రేతపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

సారా విక్రయంలో పలుమార్లు పట్టుబడి అధికారుల హెచ్చరికలను భేఖాతరు చేస్తున్న మహిళపై పీడీ యాక్ట్ మేరకు నమోదు చేసినట్లు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని పండ్రవాడ గ్రామానికి చెందిన గెద్దాడ రాఘవ సారాను అమ్మడం ఒక వృత్తిగా చేస్తుకుందని తెలిపారు. 2023 నుంచి ఇప్పటివరకు 6 సారా కేసుల్లో పట్టుబడినట్టు తెలిపారు. ఆమె తరచుగా ఇదే వ్యాపారం చేస్తుందన్నారు. పలుమార్లు పట్టుబడినా సారా అమ్మకాలు మానడం లేదన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కలెక్టర్ ఆమెపై పీడీ యాక్ట్ నమోదుకు ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. దీంతో ఆమెను మంగళవారం రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారంలో అప్పగించినట్టు తెలిపారు.

జూనియర్ కళాశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి (డిఐఇఒ) విజయ్‌శ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని రికార్డులను, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది, విద్యార్థులు ప్రతిరోజూ సమయపాలన పాటించి కళాశాలకు హాజరు కావాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. భోజనం నాణ్యతను తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వారానికి రెండు కళాశాలలను తప్పనిసరిగా తనిఖీ చేసాత్మన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిలోనూ విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ పథకాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తామని ఆమె స్పష్టం చేశారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో మంత్రి కార్యాలయంలో మంగళవారం మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా 43 మందికి మంజూరైన రూ.30,31,151 విలువ చేసే సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. 42 మంది లబ్ధిదారులకు రూ. 23,31,151 విలువైన చెక్కులు, రూ.7 లక్షల విలువైన ఎల్ఒసి లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు నిడదవోలు నియోజకవర్గంలో 235 మంది లబ్ధిదారులకు రూ.2.14 కోట్ల లబ్ధి చేకూర్చామని, పేదల ఆరోగ్యానికి సిఎంఆర్‌ఎఫ్ సంజీవని లాంటిదన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు, మంత్రి కందుల దుర్గేష్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

మిథున్‌రెడ్డితో రామచంద్రారెడ్డి ములాఖత్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

లిక్కర్ స్కామ్ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో మాజీ మంత్రి, మిథున్‌రెడ్డి తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం ములాఖత్ అయ్యారు. రామచంద్రారెడ్డితో పాటు మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, న్యాయవాది ఉన్నారు. రామచంద్రారెడ్డి విచ్చేస్తున్న విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు సెంట్రల్ జైలు వద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు. మాజీమంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పినిపే విశ్వరూప్, జడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణగోపాలరావు, వైసిపి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు వంగ గీతా, ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళరెడ్డి తదితరులు పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ కక్షసాధింపు విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. ప్రతిపక్ష పార్టీ గొంతు నొక్కే విధంగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


ములాఖత్ అనంతరం బయటకు వస్తున్న పెద్దిరెడ్డి, జక్కంపూడి తదితరులు

జీవనోపాధి కల్పించాలని వినతి

ప్రజాశక్తి-గోకవరం

తమకు జీవనోపాధి కల్పించాలంటూ శ్రీ జై దుర్గభవాని ప్యాసింజర్ ఆటో వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆటో కార్మికులు తహశీల్దార్ రామకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందించారు. తొలుత స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల లక్షలాది మంది ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లుకు ప్రభుత్వం తరపున ఉపాధి కల్పించాలని కోరారు. తమ సమస్యను దృష్టిలో పెట్టుకుని న్యాయం చేయాలని సిఎం చంద్రబాబు, డిసిఎం పవన్‌కళ్యాణ్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో భూపతిపాలెం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గోకవరం

ఇటీవలపెద్దాపురంలో జరిగిన సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్‌లో ఎపి రెసిడెన్షియల్ భూపతిపాలెం స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ప్రతిబ కనబర్చి స్టేట్ మీట్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పి.సత్యశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు విభాగాల్లో విద్యార్థులు అర్హత సాధించారన్నారు. అండర్-16 విభాగం పరుగులో పి.లోకేష్ ప్రథమ స్థానం సాధించాడన్నారు. అండర్-14 విభాగంలో స్వర్ణరాజ్ ట్రయాతిలిన్‌లో ప్రథమ స్థానం, పైడిమళ్ళ సుజిత్ మణి రత్న భూషణ్ 1000 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, షాట్ పుట్‌లో బి.ధనుష్ ద్వితీయ స్థానం, 600 మీటర్లలో బి.ధనుష్ ద్వితీయ స్థానం సాధించారని పిఇటి జి.సుధ తెలిపారు. బాపట్లలో జరిగే స్టేట్ మీట్‌కు వీరు వెళ్తారన్నారు. వెళ్లనున్నట్లు స్కూల్ పి ఈ టి తెలిపారు.రైటప్: స్టేట్ మీట్ కి ఎంపికైన 6 విద్యార్థులు.

15లోగా ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తింపు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వరి సాగు చేసే రైతులు ఈనెల 15లోపు పంటల బీమా కింద ప్రీమియంను చెల్లించాలని లేకుంటే బీమా వర్తించదని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు తెలిపారు. మంగళవారం మండలంలోని సూర్యారావుపాలెం, పసలపూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా అందిస్తున్న పథకాలను వివరించారు. నూతన వ్యవసాయం పద్ధతుల్లో భాగంగా నానో టెక్నాలజీ ద్వారా రూపొందిన నానో యూరియా, డిఎపిల వినియోగాన్ని పెంచడం ద్వారా రసాయనిక ఎరువుల వాడకాన్ని 10 నుంచి 25 శాతం వరకు తగ్గించొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాలో నిడదవోలు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నిడదవోలు

తూర్పు గోదావరి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌతమి ఘాట్‌లోని జగద్గురు పీఠంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హెచ్ఎం ఎస్.అరుణరాజేశ్వరి తెలిపారు. జూనియర్స్ విభాగంలో కె.జ్యోతి, బి.సత్యశ్రీ, కె.అనూష, సబ్ జూనియర్ విభాగంలో టి.దీపిక, కె.కనిష్క ప్రతిభ కనబర్చారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్‌డిఎస్.జేమ్స్, పిబి.కృష్ణకుమారి, శాంతి, యోగా గురువు సానెపు సుబ్బారావు, పాఠశాల సిబ్బందిని హెచ్ఎం అభినందించారు.

'సుపరి పాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని ఎస్.ముప్పవరం, చిక్కాల గ్రామాల్లో మంగళవారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి-కడియం

ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ ద్వారా రాయితీలు అందిస్తుందని మండల ఉద్యాన శాఖ అధికారి లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు హెక్టారుకు ఎన్ఎంఇఒపి పథకం ద్వారా రూ.29వేలు సబ్సిడీ ఇస్తుందన్నారు. మొక్కలను పతంజలి సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తుందన్నారు. ఇదే సంస్థ రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తుందని తెలిపారు. మొదటి నాలుగు సంవత్సరాలు హెక్టారుకు రూ.5,250 మెయింటెనెన్స్ ఖర్చు కింద ఇస్తుందన్నారు. మొదటి నాలుగు సంవత్సరాలలో అంతర పంటలు వేసుకునేందుకు హెక్టారుకు మరో రూ.5,250 రాయితీ ఇస్తుందన్నారు. రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలంలో బోరు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రోటరీ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల ఏర్పాటు

ప్రజాశక్తి - నిడదవోలు

రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామహరిప్రసాద్ సతీమణి దుర్గంబ జ్ఞాపకార్థం, వారి కుమారుడు మీసాల కాశీబాబు కనకమహాలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు వారి సహాయకులకు రసుకులు, పండ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం రూ.14 వేలతో ప్రజల సౌకర్యార్థం సమిశ్రగూడెంలోని అన్నపూర్ణ హోటల్ సమీపంలో రెండు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేవారు. మరో రెండు సిమెంట్ బెంచీలను పట్టణంలో ఒకటి, 3వ వార్డులో మరొకటి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామ హరిప్రసాద్, సెక్రటరీ దారపురెడ్డి శ్రీరామప్రతాప్, ట్రెజరర్ గుంటిపల్లి సత్యసాయి, సీనియర్ రొటేరియన్స్ ఉప్పులూరి రామ్మోహనరావు, ఈరిశెట్టి రాజగోపాలస్వామి, జి.శివ, జి.రంగారావు, ఎమ్‌డి.ఫయాజ్, జి.శ్రీనివాస్, ఎస్.వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

8, 9న రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - చాగల్లు

ఆగస్టు 8,9 తేదీల్లో రాష్ట్ర స్థాయి జూనియర్ టార్గెట్ బాల్ పోటీలు చాగల్లు జడ్‌పి హైస్కూల్లో జరుగుతాయని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. ఇందులో పాల్గొనే జిల్లా స్థాయి జట్టుకు సంబంధించి ఎంపికలు ఆగస్టు 6న జరుగుతాయని జిల్లా సెక్రెటరీ విజయలక్ష్మి తెలిపారు. ఈ సెలక్షన్స్ జడ్‌పి హెచ్ఎస్‌లో జరుగుతాయని, క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9866218582 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కథా రచయిత 'కోడూరి' మృతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



ప్రముఖ కథా రచయిత, సాహిత్య విమర్శకులు కోడూరి శ్రీరామమూర్తి(84) మంగళవారం రాత్రి రాజమహేంద్ర వరంలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. 1941 సెప్టెంబర్ 29న రాజమహేంద్రవరంలో జన్మించిన ఆయన ఐదు దశాబ్దాలకు పైగా కథ, నవల-రచన, సాహిత్య విమర్శ వంటి రంగాల్లో రాణించారు. లిటరరీ కాలమిస్ట్‌గా, సమకాలీన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను విశ్లేషిస్తూ పలు దినపత్రికల్లో ఆయన వ్యాసాలు రాశారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, వేలాది సాహితీ విమర్శనా వ్యాసాలను రాశారు. సాహితీ విమర్శకుడిగా ఆయన కృషి చేసి పలువురి మన్ననలు పొందారు. ఆయన ప్రధాన రచనల్లో 'తెలుగు నవలా సాహిత్యంలో మనో విశ్లేషణ', 'తెలుగు కథ-నాడు నేడు' వంటి గ్రంథాలు ఉత్తమ సాహిత్య విమర్శ గ్రంథాలుగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి పురస్కారాలను పొందాయి.

జీడి మామిడి సాగుపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-గోపాలపురం

జీడిమాడి తోటల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని, అధిక దిగుబడులు పొందేందుకు మేలు జాతి వంగడాలు పెంచాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎన్.మల్లికార్జునరావు సూచించారు. మంగళవారం గోపాలపురం పరిధిలోని ముప్పన రమణ రెడ్డి జీడి మామిడి తోటలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. జీడి మామిడి తోటల్లో సస్య రక్షణ చర్యలు గురించి వివరించారు. గోపాలపురం పరిధిలో సుమారు 2వేల ఎకరాలకు పైగా జీడి మామిడి తోటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి రైతు జీడి మామిడి తోటలోని ఎండుకొమ్మలను, బాగా వయసు అయిపోయినట్లయితే కాపు కాయని కొమ్మలను కత్తిరించి దానికి దానికి బోర్డ్ ఆఫ్ మిశ్రమాన్ని పూయాలని సూచించారు. అదేవిధంగా జీడి మామిడి తోటలో పురుగులు, వాటి నివారణ గురించి రైతులకు వివరించారు. జీడిమామిడి తోటల పెంపకం ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. అందుకొరకు మేలు జాతి వంగడాలు బాపట్ల పరిశోధన కేంద్రం, డాక్టర్ వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి యూనివర్సిటీ వెంకట రామన్న గూడెం, కృషి విజ్ఞాన కేంద్రం రంపచోడవరంలో అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్‌లో జీడిమామిడి మొక్కలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. వాటిని పెంచేందుకు రైతుకు రెండు సంవత్సరాల పాటు లక్ష రూపాయలకు పైగా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అలాగే ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న వివిధ రాయితీల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఉద్యాన శాఖ అధికారి జి.రమేష్, ముప్పన రమణారెడ్డి ఉద్యాన శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.